క్లుప్తంగా

అభినందన



యువతను అభినందిస్తున్న స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్

కడప స్పోర్ట్స్: జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన జాతీయస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొన్న జిల్లా యువతను స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ అభినందించారు. యువజనోత్సవాల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జిల్లా యువత, కడపకు చెందిన జయచంద్ర బృందం సాహసకృత్యాల విభాగంలో కర్రసాము విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు. వారిని, జట్టుకు మేనేజర్‌గా వ్యవహరించిన స్టెప్ జూనియర్ అసిస్టెంట్ నాగయ్యను శుక్రవారం స్టెప్ సీఈఓ అభినందించారు.

మహనీయుల పేర్లను అవమానిస్తే సహించేది లేదు

కడప వైఎస్సార్ సర్కిల్ : ప్రపంచ మేధావులైన కారల్ మార్క్స్, లెనిన్ పేర్లను అవమానిస్తే సహించేది లేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. గుంటూరు కారం సినిమాలో మహనీయుల పేర్లు విలన్లకు పెట్టి అవమానించిన సందర్భంగా నగరంలోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరి రెడ్డి, ఓబులేసు, పవన్, ఉదయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

21 నుంచి లెనిన్ శత వర్ధంతి సభలు

కడప వైఎస్సార్ సర్కిల్ : ఈనెల 21 నుంచి జిల్లా వ్యాప్తంగా లెనిన్ శత వర్ధంతి సభలను నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ లెనిన్ మరణించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా శత వర్ధంతి సభలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని మండల, పట్టణ, నగర, జిల్లా కేంద్రాలలో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

కడప కల్చరల్ : జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు పంద్రా రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలోని రాజా థియేటర్‌లో సినీ నటుడు వరుణ్‌తేజ్ పుట్టిన రోజును పురస్కరించుకుని పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన పేరిట కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలోగల ప్రేమాలయ వృద్ధుల ఆశ్రమంలో అబ్బన్నగారి రాజగోపాల్ అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా దుర్గాప్రసాద్ హాజరయ్యారు.

సంతకాల సేకరణ

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థ ప్రీమియంలపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని సంస్థ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం 67వ జీవిత బీమా జాతీయకరణ దినోత్సవ సందర్భంగా కడప ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డిలు మాట్లాడుతూ ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ అని తెలిపారు. ఎల్ఐసీని ప్రభుత్వరంగ సంస్థగా మరింత బలోపేతం చేయాలని, ఇన్సూరెన్స్ పొదుపు మొత్తాలకు ప్రత్యేకంగా ఆదాయం పన్ను రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని సంతకాలు చేసిన వారిలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి, సెరికల్చర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట రామరాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు, పెన్షనర్ల సంఘం నేతలు శంకరరావు, సుధీకర్, చంద్రశేఖర్ రెడ్డి, ఎల్ఐసి యూనియన్ల నేతలు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



సర్టిఫికెట్లు అందుకున్న రక్తదాతలతో డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కడపశాఖ కార్యాలయంలో శుక్రవారం సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. విజయవాడ నగరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించడంలో ప్రధానపాత్ర పోషించారని, ప్రజాస్వామ్యం కోసం పరితపించారని కొనియాడారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు అత్యున్నత గౌరవం ఇవ్వడం కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రపంచంలోనే ఎత్తయిన విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇది జాతి మొత్తానికి గర్వకారణమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడారు.

వేమన పద్యాలు వ్యక్తిత్వ వికాస పాఠాలు

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

– ఘనంగా వేమన జయంతి వేడుకలు



వైవీయూ : వేమన చైతన్యయాత్రలో వైవీయూ వీసీ చింతా సుధాకర్, అధికారులు, విద్యార్థులు

వైవీయూ : ఉన్నతమైన వ్యక్తిత్వం అలవడాలంటే వేమన పద్యాలు అర్థం చేసుకొని అనుసరిస్తేచాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్‌బ్లాక్‌లోని సురభి సమావేశ మందిరంలో ×వేమన జయంతి ఉత్సవం× ఘనంగా నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ మహాకవి వేమన పద్యాలు సమాజాన్ని మేలుకొలుపుతాయన్నారు. వేమన పేరును సార్థకత చేసేలా జాతీయస్థాయిలో విశ్వవిద్యాలయం ఉందన్నారు. మానవతా విలువలు, సమాజం పట్ల గౌరవం, పెద్దలను గౌరవించడం వేమన పద్యాలు నేర్పుతాయన్నారు. పండితులు, పామరులు అర్థం చేసుకునే వేమన పద్యాలు ఆనాటి వ్యవస్థపై తిరుగుబాటు చేశాయని, సామాజిక విప్లవానికి ఊపిరిలూదాయని విశ్లేషించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వేమన జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడం వేమన భావజాలాన్ని భావితరాలకు అందజేయడానికి దోహదపడుతుందన్నారు. వేమన ఉద్దీపనా గీతం అందరినీ ఆలోచింప చేస్తుందని, ప్రేరణ నింపుతుందని విశ్లేషిస్తూ ఆ గీతం రచయిత ఆచార్య ఈశ్వర్‌రెడ్డిని అభినందించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ వేమన కుండబద్దలు కొట్టినట్టు సమాజంలో ఉండే వాస్తవికతను ప్రస్తావించారన్నారు. డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య టి. రామప్రసాదరెడ్డి , ప్రధాన వక్త, వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి కీలక ఉపన్యాసం చేస్తూ మానవత్వాన్ని, ప్రపంచతత్వాన్ని అర్థం చేసుకోవడానికి వేమన పద్యాలు ఉపయోగపడతాయన్నారు.

వేమనకు ఘన నివాళి...

విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం నుంచి వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్ రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది వేమన చైతన్యయాత్ర (ర్యాలీ) నిర్వహించారు. వైవీయూ ప్రధాన ద్వారం వద్ద అతిథులు వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ట్స్ బ్లాక్ వరకు డప్పులతో ర్యాలీ కొనసాగింది. సురభి సమావేశ మందిరంలో పద్యగానం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైవీయూ అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఏజీ దాము, పాలకమండలి సభ్యులు డాక్టర్ మాదక్క, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు.

వేమన పద్యం సమాజానికి దిక్సూచి

కడప కల్చరల్ : వేమన పద్యాలు సమాజానికి దిక్సూచి లాంటివని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. సీపీ .బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం వేమన జయంతి నిర్వహించారు. తొలుత వీసీ చింతా సుధాకర్ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది కలసి వేమన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం వారు వేమన పద్యాల గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.రమాదేవి, గ్రంథాలయ సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

– వేమన తన పద్యాల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యం రగిలించారని రెడ్డి సేవా సమితి అధ్యక్షులు కె.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డిలు కొనియాడారు. వేమన జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో రాజీవ్‌మార్గ్‌లోగల వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్.రామసుబ్బారెడ్డి, ఆనంద్‌కుమార్‌రెడ్డి, రెడ్డి కుమారి, ఎస్ఆర్ శివనారాయణరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, జనసంఘ్ జిల్లా అధ్యక్షులు మద్దిక సుబ్బిరెడ్డి, ఆచార్య జి.శివారెడ్డి, ఆచార్య కె.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడప కల్చరల్ : వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సేవా సమితి ప్రతినిధులు

వేమన ప్రజాకవి

కడప అగ్రికల్చర్: వేమన విశ్వ, ప్రజాకవి అని కడప డీసీసీ బ్యాంకు ఓఎస్డీ గుర్రప్ప అన్నారు. వేమన జయంతి పురస్కరించుకుని శుక్రవారం కడప రాజీవ్‌పార్కులోని ఆయన విగ్రహానికి డీసీసీ బ్యాంకు మేనేజర్స్ రాజేంద్ర, గంగాధర్‌లతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సిబ్బంది బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు ఒక వరం లాంటిదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని నందిమండలం-2 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్యం అందించి ఉచితంగా మందులు అందించాలన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా సరైన వసతులు కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు ప్రజలకు త్వరగా అందజేయాలన్నారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి ఎంపీహెచ్ఈఓ ప్రసాద్, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యులు వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



డ్రోన్ల వినియోగం గురించి వివరిస్తున్న అధికారులు

వల్లూరు : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్‌డీ ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని లేబాక, కొప్పోలు గ్రామాలలో శుక్రవారం వికసిత భారత సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను గురించి వివరించారు. అనంతరం డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. వికసిత భారత సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పాలెం సురేష్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. శుక్రవారం కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ కమీషన్ ఏర్పాటు చేసినా దానిమీద ఎటువంటి పురోగతి లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలతోపాటు భారతీయులందరి గుండెల్లో శాశ్వతంగా కొలువై ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం చాలా సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. గంగరాజు, జిల్లా కార్యదర్శి కట్టా గంధాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్జేయూపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్-2024 సంవత్సరానికి సంబంధించిన డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం కడపలోని భుజంగరావు స్మారక ఆర్జేయూపీ టీచర్స్ హోంలో ఆ సంఘ నాయకులతో కలిసి రాష్ట్ర అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌రావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తేజు వీరబ్రహ్మం మాట్లాడుతూ ఆర్జేయూపీ ప్రతి ఏటా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఉపయుక్తంగా నియమ, నిబంధనల, జీవోల సమాచారంతో డైరీని ప్రచురిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు రవీంద్రనాథబాబు, మహిళా కన్వీనర్ అనసూయదేవి, టీచర్స్ హోం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు రాజగోపాల్, వెంకటసుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు వైఎస్సార్ సీపీ శ్రేణులు



అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలివెళుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

కడప కార్పొరేషన్ : విజయవాడలో ఏర్పాటు చేసిన 206 అడుగుల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు కడప నగరం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు బయలుదేరి వెళ్లాయి. శుక్రవారం ఉదయం సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, ఎస్సీ సెల్ నాయకుడు సీహెచ్ వినోద్ కుమార్‌తోపాటు ఇతర నేతలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

బీసీ గర్జన జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్ : కడప నగరంలోని కళాక్షేత్రంలో ఈనెల 21న జరగనున్న బీసీ గర్జన సభను జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సిద్దవటం రోడ్డులోని పొరవేదిక కార్యాలయంలో బీసీ గర్జన గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు బీసీ సంఘాల నాయకులు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొరవేదిక పట్టణ కన్వీనర్ ఎస్.వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పీరయ్య, ఆవాజ్ పట్టణ అధ్యక్షుడు సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : కార్మిక వర్గాలు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి వాటివల్ల కలిగే ప్రయోజనాలను పొందాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధి శాంత పిలుపునిచ్చారు. శుక్రవారం న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు కడప నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్లో ఉన్న పవన్ కెమికల్స్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ చట్టాలు, నీటి ప్రాముఖ్యత, ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పనిచేసే చోట తప్పనిసరిగా ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కలిగించేలా యాజమాన్యం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అలాగే లీగల్ ఎయిడ్ క్లినిక్, లోకాయుక్త, కార్మిక చట్టాలు తదితర అంశాలను వివరించారు. బాధితులు నష్టపోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, పారా లీగల్ వాలంటీర్ ఎస్.దశరథ రామిరెడ్డి, పవన్ కెమికల్స్ యాజమాన్యం, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధి శాంత

దెబ్బతిన్న వరిపంట పరిశీలన

కడప అగ్రికల్చర్: కడప మండల పరిధిలోని పాత కడప, మోడమీదిపల్లె గ్రామాలలో శుక్రవారం కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్తలైన డాక్టర్ శ్రీనివాసచారి, జాన్సన్‌లతో కలిసి రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి వరిపంటను పరిశీలించారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేసిన వరిపంట అక్కడక్కడ దెబ్బతినడంతో పాటు వరి మొలకలు చనిపోతుండడంతో పలువురు రైతులు ఆయన దృష్టికి తేవడంతో ఆయన శాస్త్రవేత్తలతో కలిసి వరిపంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. వరిలో మొక్కలు చనిపోకుండా ఉండటానికి 19.19.19లను 5 గ్రాములు మరియు చిలేటెడ్ జింగ్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి అవసరాన్ని బట్టి ఎకరాకు 200 లీటర్లను రెండు నుంచి మూడు దపాలు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అలాగే ఆకుచుట్టు పురుగు నివారణకు అసిపేట్ 200 గ్రాములు లేక ఫ్లూ బెండ్‌మైడ్ 40 గ్రాములు 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు పావని, మోహరాజ్, రైతులు పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్ రెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీనివాసచారి, జాన్సన్

రేపు నగరంలో మహా శోభాయాత్ర

– 22న హోమాలు, అభిషేక కార్యక్రమాలు

కడప కల్చరల్ : అయోధ్య ఐక్య వేదిక ఆధ్వర్యంలో కడప నగరంలో ఈనెల 21వ తేదీన శ్రీ రామ మహాశోభాయాత్ర నిర్వహించనున్నట్లు వేదిక ప్రతినిధులు తెలిపారు. ఈ శోభాయాత్ర చిన్నచౌకు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమై అప్సర సర్కిల్, వై-జంక్షన్, ఆర్టీసీ సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డివీధి, అన్నమయ్య సర్కిల్, కృష్ణా సర్కిల్, గోకుల్ సర్కిల్, వన్‌టౌన్ సర్కిల్, పాత బస్టాండు సర్కిల్, ఏడురోడ్ల కూడలి, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఐటీఐ సర్కిల్, కాగితాలపెంట, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్‌మార్గ్ మీదుగా హౌసింగ్‌బోర్డు కాలనీలోగల శ్రీ కోదండ రామాలయం వద్ద ముగుస్తుందన్నారు. అలాగే 22వ తేదీ ఉదయం 6 గంటలకు శ్రీరామ హోమం, ఆ తర్వాత భక్తుల స్వహస్తాలతో శ్రీ రామలక్ష్మణ, సీతా, ఆంజనేయుల విగ్రహాలకు అభిషేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అయోధ్యలో రామప్రతిష్ఠ జరిగే సమయంలో ఆలయంలో స్క్రీన్ ఏర్పాటు చేసి భక్తులకు ప్రతిష్ఠ కార్యక్రమం ప్రదర్శించే ఏర్పాట్లు చేశామన్నారు. ఈ శోభాయాత్రలో భక్తులు సంప్రదాయ వస్త్రధారణ (తెల్లని దుస్తులు)తో హాజరు కావాలన్నారు. అదేరోజు సాయంత్రం పాలకొండపై శ్రీరామ అఖండ దివ్యజ్యోతిని వెలిగిస్తామన్నారు. ఈ శోభాయాత్ర 18 అడుగుల శ్రీరాముడి దివ్య విగ్రహంతో సాగుతుందన్నారు.

అరటిలో తెగుళ్ల నివారణ చేపట్టండి

ఓబులవారిపల్లె : అరటిలో పోషక లోపం, తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలని వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆచార్యులు సీహెచ్ రూత్, డాక్టర్ కె.స్వరాజ్యలక్ష్మిలు పేర్కొన్నారు. శుక్రవారం వైకోట గ్రామంలో అరటి తోటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ జీ-9 రకానికి చెందిన అరటి మొక్కలకు పోషక లోపాలు, పండుటాకు తెగులు, ఆకు చివరన కుళ్లడం తదితర సమస్యలను గుర్తించారు. రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వలన అరటి గెలలు రావడానికి ఆలస్యమవుతుందన్నారు. పోషక లోపం నివారణకు 13 - 0.45(పొటాషియం నైట్రేట్)ను గెలలకు పిచికారీ చేయాలని సూచించారు. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వాడటం రైతులు అలవరుచుకోవాలని సూచించారు. పండుటాకు తెగులు నివారణకు ప్రొఫికీనజోల్ ఒక మిల్లీ లీటరు లీటరు నోటిలో కలిపి తెగులు సోకిన ఆకులకు పిచికారీ చేయాలన్నారు. అనంతరం అరటి సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఉద్యాన కళాశాల అనంతరాజుపేట అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీలత, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

నేడు రైతులతో సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. రాయచోటి - చాగలమర్రి హైవే రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రొద్దుటూరు మండలంలో భూములు కోల్పోయిన గోపవరం, ప్రొద్దుటూరు, నంగనూరుపల్లె, కొత్తపల్లె గ్రామాలకు సంబంధించిన రైతులు హాజరు కావాలని ఆయన కోరారు. మండలంలో మొత్తం 91 ఎకరాల భూమిని సేకరించామన్నారు.

భద్రకాళికి రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : వీరభద్రస్వామి ఆలయంలోని భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహణలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పూలు, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నప్రసదాన్ని అందజేశారు. ఈ పూజలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాలను వాడాలి

జమ్మలమడుగు : రైతులు అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాలను వాడాలని వ్యవసాయశాఖ శిక్షణ కేంద్రం ఏఈ శైలజ తెలిపారు. శుక్రవారం మండలంలోని శేషారెడ్డిపల్లె గ్రామంలో రైతులకు పంటలు సాగుబడి చేసే విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ మండలాల్లో పంట సరళిని బట్టి విడుదలైన నూతన విత్తన రకాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు సాగుచేసిన శనగ పంట సక్రమంగా దిగుబడులు రాకపోతే అంతర పంటగా ధనియాలు, ఆవాలను వేసుకోవాలని ఆమె సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ గురుశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తులపైన అవగాహన

పులివెందుల రూరల్, లింగాల : పట్టణంలోని ఆహార సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా 7 రోజుల పాటు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం గ్రామంలో పండ్లు, చిరుధాన్యాలు, కూరగాయలు ఆధారిత ఉత్పత్తులు, తయారీ వ్యవసాయ, ఉద్యానపంటలు, పశుపోషణ తదితర అంశాలపై సర్వే నిర్వహించారు. జాతీయ సేవా పథకం అధికారి నజ్మా, డీఎంఎస్ బేగ్‌లు రైతులు అధికారుల సూచనలు, సలహాలు జాగ్రత్తగా పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కీర్తిరెడ్డి, ప్రవీణ్, రాజశేఖర్, సుబ్బారెడ్డి, వలంటర్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జాతీయ సేవా పథకం అధికారులు

నకిలీ మందులు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



వెల్లటూరులో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

పెండ్లిమర్రి : ఎరువులు, పురుగుమందుల దుకాణాదారులు రైతులకు నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని బద్వేల్ వ్యవసాయశాఖ ఏడీఏ నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి దుకాణాల్లో ఉన్న స్టాక్ రిజిస్టర్, వేబిల్లులు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు ఎరువులు అమ్మేటప్పుడు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ అమ్మితే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు.

హియరింగ్ ప్యాడ్స్ పంపిణీ



హియరింగ్ ప్యాడ్స్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : మండలంలోని పలువురు చెవిటి వారికి హియరింగ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. మండలంలో గతంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొంత మంది చెవిటి వారు తమకు చెవిటి మిషన్లు కావాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఆయన హియరింగ్ ప్యాడ్స్(చెవిటి మిషన్లు) పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు స్థానిక నాయకులు వాటిని అందజేశారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో ఈ హియరింగ్ ప్యాడ్స్‌ను నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, విజయేంద్రారెడ్డి, సురేష్ యాదవ్, నారపురెడ్డి, మైసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.